క్లుప్తంగా

ఉత్తమ సేవలకు ప్రశంసలు



డీఎంహెచ్‌వో నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తనకాల సత్యనారాయణ

పెదగంట్యాడ: క్షయ నివారణలో ఉత్తమ సేవలందించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న తనకాల సత్యనారాయణకు ప్రశంసా పత్రం లభించింది. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

సీఐని సత్కరించిన ఆలయ కమిటీ



దువ్వాడ సీఐని సత్కరిస్తున్న మరిడిమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్య వలస గ్రామదేవత మరిడిమాంబ ఉత్సవాలను ఎటువంటి ఆటంకం లేకుండా, బందోబస్తు నిర్వహించి సహకారం అందించిన దువ్వాడ సీఐ మల్లేశ్వరరావును ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఆలయ వ్యవస్థాపకులు పట్టా రామ అప్పారావు, కమిటీ చైర్మన్ బలిరెడ్డి శ్రీను, ప్రతినిధులు బుదిరెడ్డి అప్పారావు, వద్దాది శ్రీను, విందుల వరహాలు, సాయిన సన్యాసిరావు, మరిశా రామచంద్రరావు, బందారు చందు, పలకా అచ్యుత్ పాల్గొన్నారు.

దివ్యశ్రీకి అభినందనలు



దివ్యశ్రీని అభినందిస్తున్న రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పి.దివ్యశ్రీ ఈ ఏడాది జనవరిలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్ వేడుకల్లో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా పాల్గొంది. అక్కడ ప్రదర్శనలో దివ్యశ్రీ చూపిన ప్రతిభకు పలువురు ప్రముఖులు అభినందించారు. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నాడు పరేడ్‌లో పాల్గొన్న పలువురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అమరావతిలోని గవర్నర్ నివాసం వద్దకు పిలిపించి అభినందించారు. గవర్నర్ అభినందించిన వారిలో సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన దివ్యశ్రీ ఉండటంతో కళాశాల యజమాన్యంతో పాటు జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు దివ్యశ్రీని అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ వద్ద అసర్ ఆలీని తండ్రికి అప్పగిస్తున్న బ్లూ కోల్ట్ సుధీర్

గోపాలపట్నం: ఉదయం 8 గంటలకు తప్పిపోయిన బాలుడు మధ్యాహ్నం 12 గంటలకు ఎయిర్‌పోర్టు పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాలెం గ్రీన్ గార్డెన్ నివాసముంటున్న అసర్ ఆలి ఆదివారం ఉదయం 8 గంటలకు ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బాలునికి మతి స్థిమితం సరిగా లేదని అందువల్లే వెళ్లిపోయాడని తల్లిదండ్రులు చెప్పారు. చుట్టు పక్కలా వెతికినా కనిపించక పోవడంతో వాట్సప్‌లో మెసేజ్ రూపంలో అందరికీ షేర్ చేశారు. ఇది గమనించిన ఎయిర్‌పోర్టు పోలీసులు స్పందించి వెతికేందుకు బ్లూ కోల్ట్ సుధీర్‌ను వెంటనే నియమించారు. సీసీ పుటేజీలను పరిశీలించగా 104 ఏరియా నేవల్ క్వార్టర్స్ వద్ద ఉన్నట్టు గమనించారు. కేవలం నాలుగు గంటల్లోనే బాలున్ని తండ్రి సాల్మన్ అహమ్మద్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు పిలిపించారు. బాలుడ్ని అప్పగించడంతో పోలీసులకు సాల్మన్ కృతజ్ఞతలు తెలిపారు.



టిడ్కో ఇళ్ల వ్యూ

గూడు..గోడు

టిడ్కో ఇళ్ల కోసం ఎదురు చూపులు

టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ పంపిణీ జరిగేది ఎప్పుడో అని లబ్ధిదారులు వాపోతున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడేళ్ల తర్వాత ఇళ్లు లేని పేదలకు షేర్ వాల్ టెక్నాలజీతో టిట్కో ఇళ్లను సబ్సిడీతో బ్యాంకు లోన్ ద్వారా కట్టించి ఇస్తామని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. అయితే నేడు అదే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ లబ్ధిదారులకు ఇంకా ఇళ్లు అందజేయలేదు.

–అగనంపూడి



పైకప్పులు ఏర్పాటు చేయని మ్యాన్‌హోల్స్



కాలనీలో రోడ్లు వేయకుండా మధ్యలో వదిలేసిన దృశ్యం

- శిథిలావస్థకు చేరుతున్నా స్పందించరా...
- డబ్బులు చెల్లించి ఏడేళ్లు కావస్తోంది...
- ఆగ్రహంతో ఆందోళనకు సిద్ధమైన లబ్ధిదారులు
- కేటాయింపులు లేవు.. మౌలిక వసతులు కానరావు
- నిర్మాణ పనులు చేపట్టి దశాబ్దం దాటింది



బ్లాక్‌ల వెనుక యుజీడీ మ్యాన్‌హోల్‌పై మూతలేకుండా డ్రైనేజీలు పూడుకుపోయిన దృశ్యం



డ్రైనేజీ వ్యవస్థ లేని కాలనీ

జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సమీపంలోని మంగళపాలెంలో మూడు విడతల్లో 48 బ్లాకుల్లో 2,300 వరకు ప్లాట్లు నిర్మించారు. 2014లో పనులు ప్రారంభించి, 2018లో ఎన్నికల ముందు లబ్ధిదారుల్ని ఎంపిక చేశారు. అప్పట్లో ఒక్కొక్కరి నుంచి రూ.లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు డబ్బులు డిపాజిట్ చేయించారు. ఎన్నికల ముందు హడావుడిగా తెలుగుదేశం ప్రభుత్వం డిపాజిట్లు కట్టించి ఆశలు రేకెత్తించారు. అప్పట్లో లబ్ధిదారుల ఎంపిక కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఏది ఏమైనా ఏళ్లు గడుస్తున్నా నేటికీ ప్లాట్లు కేటాయింపులు జరగకపోవడంతో గృహసముదాయాలు నిరుపయోగంగా మారిపోయాయి. కాలనీలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్ల నిర్మాణం విస్మరించారు. మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులు మధ్యలో వదిలేశారు. ఏళ్ల నుంచి ఇళ్లు వాడకుండా వదిలేయడంతో తలుపులకు చెదలు పట్టాయి. ద్వారాలు, కిటికీలు ఊడిపోయే స్థితికి చేరాయి.

కాలనీలో కనీస వసతులు కూడా కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడంతో లబ్ధిదారులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి 9నెలలు కావస్తున్నా నేటికీ వీటి ఊసెత్తకపోవడం, కనీస వసతులు కల్పనపై దృష్టి సారించకపోవడంపై లబ్ధిదారులు అగ్గిమీదగుగ్గిలం అవుతున్నారు. తక్షణం ప్లాట్లు కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళనబాట పట్టారు.



మధ్యలో వదిలేసిన మంచినీటి ట్యాంక్ నిర్మాణం

అప్పులు చేసి మరీ డిపాజిట్ చేశాం : టిడ్కో

ఇళ్ల కోసం చేతిలో డబ్బులు లేకపోయినా అప్పులు చేసి మరీ డిపాజిట్ చేశారు. 2,300 మంది కుటుంబాలంతా దాదాపు అప్పులు చేసే డబ్బులు చెల్లించాం. ఓ వైపు చేసిన అప్పులకు వడ్డీలు..మరో వైపు ఇంటి అద్దె చెల్లిస్తూ ఆర్థిక భారంతో సతమతమవుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి టిడ్కో గృహాలను అందజేయాలి.

ఇంకెన్నాళ్లు నిరీక్షించాలి



రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు మావి. అప్పులు చేసి తిప్పలు పడుతున్నాం. ఓపక్క నెలకు ఐదువేలు వడ్డీ చెల్లిస్తున్నాం. మరో పక్క మూడు వేలు అద్దె చెల్లిస్తున్నాం. నెలలో వచ్చిన డబ్బుల్లో సగం వీటికే పోతున్నాయి. ఇంకా ఏమి తిని పిల్లలతో బతకాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్లాట్లు కేటాయిస్తే అద్దె భారం తప్పుతుంది. ఇళ్లు పాడవకుండా చూసుకుంటాం. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించి తక్షణం ప్లాట్లు కేటాయించేలా చొరవ తీసుకోవాలి.

–ఆర్. శ్రీనివాసరావు, లబ్ధిదారుడు

ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి



లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించి తక్షణం సేల్ డీడ్ వారిపేరున చేయించాలి. డబ్బులు తీసుకొని ఇన్నాళ్లపాటు ప్రభుత్వం వద్ద ఉంచుకోవడం ఇదెక్కడి న్యాయం. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే మార్గం, ప్రధాన మార్గం తక్షణం నిర్మించాలి. బ్యాంకర్లు షరతులు లేకుండా రుణాలు మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలి.

–జి.ఆనంద్, స్థానిక నాయకుడు

పేదలను ఇబ్బంది పెట్టొద్దు



పేదల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన ప్రభుత్వం నేటికీ కేటాయింపులు చేయకుండా తాత్సారం చేయడం ప్రభుత్వ పెద్దలకు తగదు. తక్షణం డిపాజిట్లు స్వీకరించిన నిరుపేదలకు ప్లాట్లు అప్పగించాలి. తరువాత రోడ్లు,డ్రైనేజీలు, మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి.ప్రతీ ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలి.

–అజరపు గోపి, లబ్ధిదారుడు

నిత్యం ఇదే తంతు..



చిననడుపూరు ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త

పెదగంట్యాడ: వుడా కాలనీ చిన నడుపూరు మధ్యలో ఉన్న ప్రధాన రహదారిపై నిత్యం చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఇక్కడ స్థానికులు చెత్తను రోడ్డుపై పడేస్తున్నారు. దీంతో అక్కడ పందులు చేరి చిందర వందర చేస్తున్నాయి. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వచ్చేవి. స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను వారికి అందజేసేవారు. అయితే ప్రస్తుతం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సక్రమంగా ఇళ్ల వద్దకు రాకపోవడంతో స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను తీసుకువచ్చి రోడ్డుపై పడేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి సక్రమంగా చెత్తను సేకరించాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాలి

అల్లిపురం: మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993, సెక్షన్ 30 ప్రకారం ప్రతి జిల్లాలో మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాల్సి అలా జరగడం లేదని మానవ హక్కుల కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఆచార్య వై.వై.సత్యనారాయణ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దామోదర్ సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం మానవ హక్కుల కోర్టుల ఏర్పాటుపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో ప్రతి జిల్లాలో ఒక సెషన్సు కోర్టును మానవ హక్కుల న్యాయస్థానంగా ఏర్పాటు చేసినా బాధితులకు సత్వర న్యాయం లభించడం లేదన్నారు. కాకినాడ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు హబీబ్ బాషా, గుండు అప్పలరాజు, వీఎస్ఎన్ మూర్తి, నక్కాని అప్పారావు, పలువురు మాజీ పోలీసు అధికారులు, న్యాయవాదులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణ

ఆగి ఉన్న లారీని ఢీకొని డ్రైవర్ మృతి

మల్కాపురం: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ ప్రాంతానికి చెందిన వీరేంద్రసింగ్ (45) శ్రావణి షిపింగ్‌కు లోడ్లు తరలించే లారీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రావణి షిపింగ్ నుంచి మారుతి సర్కిల్ మీదుగా పోర్టు రోడ్డు మార్గాన వెళ్తున్నాడు.మార్గం మధ్యలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గోత్రా గోడౌన్స్‌కు సరకు తీసుకువచ్చే లారీ ఆగి ఉంది. ఆ సమయంలో ఆగి ఉన్న లారీని గుర్తించని వీరంద్రసింగ్ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో వీరేంద్రసింగ్ అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్భీతిగా నిబంధనల ఉల్లంఘన..

ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన అండర్ పాత్ వే ప్రమాదాలకు నిలయంగా మారడంతో కొంత కాలం పాటు దీనిని వన్‌వేగా మార్చారు. ఇటీవల ఈ దారిలో రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం ట్రాఫిక్ కానిస్టేబుల్ ద్విచక్ర వాహనాన్ని అక్కడ నిలుపుదల చేశారు. అదే రహదారిలో ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ లేకుండా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ రావడం గమనార్హం.



– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దేవన్‌రెడ్డికి సత్కారం



దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న 69వ వార్డు నాయకులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని 69వ వార్డు తుంగ్లాం గ్రామానికి చెందిన నాయకులు ఆదివారం సత్కరించారు. ఈతలపాక మంగరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పెట్టు అప్పారావు, అప్పలరాజు, నవీన్, చంద్రశేఖర్, రంగా, ఈశ్వరరావు, వసంత్ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి



దీక్షలో పాల్గొన్న డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1455వ రోజు రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. ఎంతో మంది ప్రాణాల బలిదానంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించి, ప్లాంట్‌ను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి. అరుణ్‌కుమార్, భానోజీ బిల్లా, సుదర్శన్, మోహన్, కో ఆపరేటివ్ సెక్రటరీ వై. రాజేష్, మీసాల సురేష్, నాగన్న దొర, చిరంజీవి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని చిననడుపూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఈ నెల 28 నుంచి 30 వరకూ ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కొత్త అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 29న అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రామానాయుడు, ఈశ్వరరావు, అప్పారావు, శీతిని నరసింగరావు, రాంబాబు, శివ, రమణ, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు

నిరుపేద వితంతువుకు 'సత్యసాయి కుటీర్' అందజేత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి నిరుపేద వితంతువుకు ఆదివారం కానుక అందజేశారు. పాకలో ఉండే ఆ కుటుంబానికి సత్యసాయి కుటీర్ పేరిట ఇంటిని నిర్మించి అప్పగించారు. సత్యసాయి సేవా సమితి తమ దత్తత గ్రామాలైన నమ్మిదొడ్డి, యలమంచిలిదొడ్డి గ్రామాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా డెయిరీ కాలనీలో ఉంటున్న శారదాంబ పరిస్థితిని చూసి వారి స్థలంలో ఇంటిని నిర్మించారు. డెయిరీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నివాసితుల సమక్షంలో ఆర్.ఎ. నాయుడు, ఈశ్వరి, జి. రామకృష్ణ, బి.బాబూరావు, ఎస్.కె.ఆర్.కె. రాజు, పి. ప్రకాశ్, నడుపూరు శ్రీనివాస్ తదితరులు ఇంటిని శారదాంబకు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్తలు ఆర్.ఎ. నాయుడు, సాయి కుమార్, ఎం. ఈశ్వరరావు, సమితి కన్వీనర్ జి. రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సత్యసాయి ప్రతినిధి

నేటి నుంచి లైబ్రేరియన్లకు వర్క్‌షాప్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 24 నుంచి 28 వరకు లెర్నింగ్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల లైబ్రేరియన్లకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను గుజరాత్ వారి సహాయ సహకారాలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గ్రంథాలయాధికారులకు ఉపయోగపడేటట్లు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

బ్రహ్మజ్ఞానంతో మోక్ష మార్గం

తగరపువలస: బ్రహ్మజ్ఞానంతోనే మోక్షం సిద్ధిస్తుందని సంత్ నిరంకారీ మిషన్ కాకినాడకు చెందిన సద్గురు పవిత్ర అన్నారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో ఆదివారం జరిగిన సత్సంగంలో ఆమె మాట్లాడారు. ప్రతి మనిషి కొంత వరకు మాత్రమే మంచిగా ఉండగలుగుతాడన్నారు. జీవితాంతం మంచి మనిషిగా ఉండేందుకు ఎంతో సాధన అవసరమన్నారు. పరమాత్మను దర్శిస్తూ దైవగుణాలను ధారణ చేయాలన్నారు. కరుణ, దయ, సహనం వంటి సద్గుణాలను సహజంగా కలిగి ఉంటూ, వాటిని ప్రదర్శించాలన్నారు. అందరితో ప్రేమ పూర్వకంగా మెలగాలన్నారు. ఇతరులకు కూడా సుఖశాంతులు చేకూరాలనే పవిత్ర భావన మదిలో మెలగాలన్నారు. స్వయంగా జ్ఞానప్రకాశంలో జీవిస్తూ, సత్య మార్గం వైపు అడుగులు వేసేలా ఇతరులకు ప్రేరణ కలిగించాలన్నారు. దేహం ఉండగానే తన జీవితంతో పాటు అందరి జీవితాలను పరిమళింపచేయాలన్నారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, సన్యాసి నాయుడు, నిరంకారీ మండల్ విశాఖ అధ్యక్షుడు ప్రేమ, సత్యనారాయణ రాజు, పార్వతమ్మ, శ్యామ్, రవితో పాటు ఉత్తరాంధ్ర నుంచి పలువురు భక్తులు పాల్గొన్నారు.